క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ



రేపల్లె రూరల్: పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం నిర్వహించిన నూతన వస్త్రాలు అందజేత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు విధులపట్ల నిర్లక్ష్యం వహించకుండా సక్రమంగా పనులు నిర్వర్తిస్తూ స్వచ్ఛ రేపల్లె సాధనకు తమ వంతు సేవలు అందించాలని కోరారు. నూతన వస్త్రాలే కాకుండా ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఇప్పటికే అన్ని రకాల పనిముట్లను అందించటం జరిగిందని, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొగదారమ్మ మాలధారణ మహోత్సవం



నిజాంపట్నం: నిజాంపట్నం గ్రామ దేవత మొగదారమ్మ అమ్మవారి మాలధారణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గ్రామ దేవత మొగదారమ్మ ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలు, పళ్ళు, పువ్వులు, కొబ్బరికాయలతో పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించి 30 మంది భక్తులు వెంకటరామయ్య గురుస్వామి చేతుల మీదుగా వల్లభనేని సహదేవుడు ఆధ్వర్యంలో మాలధారణ తీసుకున్నారు. గురుస్వామి మాట్లాడుతూ 16 సంవత్సరాల నుంచి గ్రామ దేవత మొగదారమ్మ తల్లి ఆశీస్సులతో మాల ధరించి నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో మండల కాలం పాటు దీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమికి ఆ తల్లి సన్నిధిలో ఇరుముడిని సమర్పిస్తామని పేర్కొన్నారు.

రెండు ఆటోలు ఢీ కొని మహిళకు గాయాలు



వేమూరు: రెండు ఆటోలు ఢీ కొనడంతో మహిళకు స్వల్ప గాయాలైన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. వేమూరు నుంచి ఆటోలో మహిళ తెనాలి బయలు దేరింది. వేమూరు గ్యాస్ గోడౌన్ నుంచి మద్యం తాగి ఉన్న మరో ఆటో డ్రైవర్ వేమూరు వెళుతున్నాడు. సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో తెనాలి వెళుతున్న ఆటోను ఢీ కొట్టడం జరిగింది. ఆటో బోల్తా పడటంతో ఆటోలో ఉన్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే బాధితురాలిని ఆరోగ్య కేంద్రం వైద్యశాలకు స్థానికులు తీసుకెళ్లారు. వైద్యులు వెంటనే వైద్య సేవలు అందించారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు గురువారంతో ముగిశాయి. వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, రోహిత్ వర్మ, వీరవల్లి మురళి, ఈదర వెంకట పూర్ణచంద్, గుమ్మడి రమేష్, కె.నాగభూషణం, కుర్రా శ్రీనివాసరావు, సాంబశివరావు, పోతురాజు పాల్గొన్నారు.

పంట కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన పంట కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పినపాడులోని పంటకాల్వను గురువారం పరిశీలించారు. వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం 21, 26, 27, 28 వార్డుల్లో ఆమె పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పర్యటనలలో నా దృష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ప్రారంభం ఎప్పుడో..?!

- నిరుపయోగంగా మారిన దళితవాడ వాటర్ ట్యాంక్
- అన్ని రోడ్లకు పైపు లైన్‌లు కూడా పూర్తి
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చినపరిమి గ్రామంలో చెట్టు కింద దళితవాడలో వాటర్ ట్యాంక్ నిర్మాణం.. పైపు లైన్ల నిర్మాణం పూర్తయింది కానీ ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. దీంతో అక్కడి ప్రజలు వాటర్ ట్యాంక్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ట్యాంక్‌ను ప్రారంభించి తాగు నీరు అందించాలని వేడుకుంటున్నారు.



చినపరిమి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

వేమూరు: వేసవి కాలం ప్రారంభమైనా ప్రభుత్వం తాగు నీటి సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో చెట్టు కింద దళితవాడలో వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. ట్యాంక్ నిర్మాణం పూర్తయి పైపులైన్‌లు కూడా వేసినా ఇంత వరకు ట్యాంక్ ప్రారంభానికి నోచుకోలేదు. చినపరిమి గ్రామంలో చెట్టు కింద దళితవాడలో 500 కుటుంబాల వారు జీవిస్తున్నారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ ప్రారంభం చేయకపోవడంతో గ్రామస్తులు కొద్ది దూరంలో ఉన్న బోరు చేతి పంపు వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. గ్రామంలోని చేతి పంపులో ఉప్పు నీరు వస్తుంది. తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. వెంటనే కూటమి ప్రభుత్వం గ్రామంలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించి ప్రజల దాహం తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తి

చినపరిమి గ్రామంలో దళితవాడకు గత టీడీపీ హయాంలో వాటర్ ట్యాంక్ మంజూరు చేశారు. ట్యాంక్ నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయలేదు. 2019 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేశారు. దళితవాడలో అన్ని రోడ్లకు వాటర్ పైపు లైన్‌లు కూడా వేశారు. 2024 ఎన్నికల కోడ్ రావడంతో వాటర్ ట్యాంక్ ప్రారంభం చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు అయింది. ఇంత వరకు వాటర్ ట్యాంక్ గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళితవాడ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

ప్రారంభంలో పక్షపాతం



చినపరిమి గ్రామంలో తాగునీరు ట్యాంక్ ప్రారంభంలో కూటమి ప్రభుత్వం పక్షపాతం చూపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా వాటర్ ట్యాంక్ గురించి పట్టించుకోవడం లేదు.

– తమ్మా పాముల రెడ్డి, చినపరిమి, చుండూరు మండలం

తాగు నీరు అందించాలి



చినపరిమి గ్రామంలో చెట్టు కింద దళితవాడలో ప్రజలు తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దళితవాడ వాటర్ ట్యాంక్ ప్రారంభించి తాగునీరు అందించాలి.

– తమ్మా బసివి రెడ్డి, చినపరిమి, చుండూరు మండలం

నా దృష్టికి రాలేదు

చినపరిమి గ్రామంలో చెట్టు కింద దళితవాడలోని తాగునీటి సమస్య నా దృష్టికి రాలేదు. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడుతాను.

– సుదీప, ఎంపీడీవో, చుండూరు మండలం

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం బాధాకరం

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేయటం ముస్లిం మైనార్టీల పట్ల బీజేపీకి ఉన్న సవితి ప్రేమకు ప్రత్యక్ష నిదర్శనమని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలపై వ్యవహరిస్తున్న కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదింపజేశారన్నారు. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసన తెలియజేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా బిల్లును ఆమోదింపజేయటం దుర్మార్గమైన చర్యన్నారు. బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షురాలు నసిరున్నీసా బేగం మాట్లాడుతూ ముస్లింలపై జరుగుతున్న కుట్రలలో భాగంగానే బిల్లుకు ఆమోదం తెలిపారన్నారు. బిల్లును ఆమోదించిన రోజు దేశానికి చీకటి రోజని అభివర్ణించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీ, క్రైస్తవులపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. తరతరాల నుంచి ఉన్న చట్టాలు, హక్కులను కాలరాస్తూ వారి మనోభావాలు దెబ్బతినేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని అపహాస్యం పాలు చేస్తూ మతపరమైన బిల్లును ప్రవేశపెట్టి ఏకపక్షంగా ఆమోదించటం బాధాకరమన్నారు. వక్ఫ్ సరవణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు లియాకత్ బాషా, అబ్దుల్ ఖుద్దూష్, గౌస్, ఖాదర్ రఫీ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల



బ్రహ్మంగారి ఆలయంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ



గ్రామోత్సవానికి తరలివచ్చిన బ్రహ్మంగారి మొక్కుబడి జెండాలు

- పూజల్లో ఎమ్మెల్యే నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే గోవర్ధనరెడ్డి
- స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కర్లపాలెం: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనా తిరునాళ్ల మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్లలో స్వామివారి ఆలయ జెండాతో పాటు గ్రామంలో భక్తుల మొక్కుబడుల జెండాలు కలిపి సుమారు 20 ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి జెండాలకు మహిళలు హారతులిచ్చి పూజలు చేసి టెంకాయలు సమర్పించారు. గ్రామోత్సవంలో స్వామి వారి జెండాలు పాతనందాయపాలెం డొంక మీదుగా కర్లపాలెం ఐలాండ్ సెంటర్ వరకు అక్కడి నుంచి తిరిగి ఊరేగింపుగా స్వామి వారి గుడి వద్దకు తీసుకువచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించి రావిచెట్టుకు జెండాలను ప్రతిష్టించారు. తిరునాళ్లలో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించటంతో పాటు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన రెడ్డి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేసి రావి చెట్టు వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మురళి కోలాటం, భజన, బ్రహ్మంగారి చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎలాంటి అల్లర్లు జరగకుండా స్థానిక ఎస్‌ఐ రవీంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



కుచ్చెళ్లపాడు గ్రామంలో ర్యాలీ



పెదపూడి గ్రామంలో ర్యాలీ



చినపరిమి గ్రామంలో ర్యాలీ

వేమూరు: వేమూరు మండలంలోని పెనుమర్రు, కుచ్చెళ్లపాడు గ్రామాలను రెండో విడత రీ సర్వే గ్రామాలుగా ఎంపిక చేయడం జరిగిందని తహసీల్దారు సుశీల తెలిపారు. పెనుమర్రు, కుచ్చెళ్లపాడు గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే గ్రామాల్లో రైతుల భూములు కొలతలు వేసి హద్దుల్లో రాళ్లు వేయడం జరుగుతుందన్నారు. అందువల్ల రైతులందరు తమ భూములను రీ సర్వే చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, వీఆర్వో నరేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): రైతుల భూములకు పూర్తి హక్కులు కల్పించేందుకు రీ సర్వే చేయడం జరుగుతుందని తహసీల్దారు నెహ్రూబాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం, పెదపూడి గ్రామాలను రెండో విడత రీ సర్వే గ్రామాలుగా ఎంపిక చేశారు. గురువారం రెండు గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండో విడత రీ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): రైతుల భూములకు పూర్తి హక్కులు కల్పించేందుకు రీ సర్వే చేయడం జరుగుతుందని తహసీల్దారు డి.నాగరాజు తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి, కేఎస్‌పాలెం గ్రామాల్లో భూ రీ సర్వే పై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. మండలంలోని రెండో విడత భూ రీ సర్వే గ్రామాలుగా చినపరిమి, కేఎస్ పాలెం ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన భూయాజమాన్య హక్కులను స్పష్టంగా పొందుపరచడం జరుగుతుందని అన్నారు. రైతులందరు రెవెన్యూ సిబ్బందికి పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.

వేప కషాయం తయారీపై రైతులకు అవగాహన

తెనాలిటౌన్: వేప కషాయం తయారీ, వినియోగంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.ఉషారాణి సూచించారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో గురువారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం లామ్ గుంటూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వేప కషాయం తయారీ, పంటలో వినియోగం, ఉపయోగాలను వివరించి చార్ట్ రూపంలో చూపించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, రైతులు కళ్యాణం మల్లిఖార్జునరావు, కళ్యాణం వెంకటరామయ్య, వీఏఏ శివసాయితేజ, మౌనిక, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలిలో ముగిసిన రుణమేళా

తెనాలిటౌన్: మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణమేళా గురువారంతో ముగిసింది. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు రుణమేళాకు హాజరయ్యారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను, సిబిల్ స్కోర్‌ను బ్యాంకు అధికారులు పరిశీలించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి కార్యాలయంలో నిర్వహిస్తున్న రుణమేళా పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో ఆన్‌లైన్‌లో 835 మంది అభ్యర్థులు బీసీ, ఓసీ కార్పొరేషన్‌లకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. బుధవారం 300 మంది అభ్యర్థులు హాజరుకాగా, గురువారం 350 మంది హాజరైనట్లు తెలియజేశారు. వీరిలో అర్హత కలిగిన అభ్యర్థులకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ



తెనాలి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీకాకుమాను వెంకటసుబ్బయ్య వందేళ్ల క్రితం బాటసారుల కోసం స్థాపించిన సత్రంలో గురువారం ఆయన జయంతిని నిర్వహించారు. పేదలకు అన్నదానం, దుప్పట్లను పంపిణీ చేశారు. తిరుపతి మల్టీజోన్-2 ప్రాంతీయ సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ఈ కార్యక్రమం జరిపారు. వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు కె.గిరిధర్, కార్యనిర్వహణాధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి, దేవదాయ సిబ్బంది సుబ్బారావు, లక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వం ధాన్యం, పచ్చిమిర్చి కొనాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు

కర్లపాలెం: ప్రభుత్వం ధాన్యంతో పాటు పచ్చిమిర్చి కూడా కొనేందుకు కృషి చేయాలని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయటంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. రైతులు పండించిన పచ్చిమిర్చికి కూడా ధర లేక రైతులు నష్ట పోతున్నారని గిట్టుబాటు ధరకు కొనాలని ఆయన కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు ఫొటోలకే పరిమితమవుతున్నారని రైతులకు సరైన అవగాహన కల్పించటం లేదని చెప్పారు. ఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, ఎంపీటీసీలు కమల, వాణి, లక్ష్మణరావు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చట్ట సవరణతో పెన్షనర్లకు తీవ్ర నష్టం

తెనాలిలో నిరసన తెలియజేస్తున్న విశ్రాంత పోస్టల్ ఉద్యోగులు



నినాదాలు చేస్తున్న విశ్రాంత పోస్టల్ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన కేంద్ర పెన్షన్ చట్ట సవరణ వలన ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఉమా మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద గురువారం కొద్దిసేపు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం చేసిన చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ తెనాలి డివిజన్ కార్యాలయంలో ఎల్.ప్రసాద్‌రావు మాట్లాడుతూ కేంద్రం చేసిన చట్ట సవరణ వలన వేతనాలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులు దీని వలన తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు వి.వి.సత్యనారాయణ, టి.పోతురాజు, షేక్ నురూద్దీన్, తపాల పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు ఐ.కోటేశ్వరరావు, కె.లక్ష్మణరావు, ఎం.తిరుమలరావు, గోవిందనాథ్ పాల్గొన్నారు.

జాతీయ డాడ్జిబాల్ పోటీలకు 'శ్రీరామ' విద్యార్థులు



తెనాలి: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో శుక్రవారం నుంచి ఏడో తేదీ వరకు జరగనున్న 17వ సీనియర్ జాతీయ డాడ్జిబాల్ పోటీలకు చిలుమూరులోని శ్రీరామ రూరల్ విద్యాసంస్థలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైనవారిలో ఎస్.ధర్మతేజ, పి.హేమప్రకాష్, ఎం.ఈశ్వర మణికంఠ, ఎ.చైతన్య, కె.దేవసింహ ఉన్నారని శ్రీరామ విద్యాసంస్థల డైరెక్టర్ కొలసాని తులసీవిష్ణుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 19 రాష్ట్రాలకు చెందిన జట్లు పోటీపడనున్న జాతీయ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తమ విద్యార్థులు అయిదుగురు ఎంపికవటంపై శ్రీరామ ప్రిన్సిపాల్ ఉమారాణి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులను అభినందించారు.

బహిరంగ ప్రకటన

[illegible]

కల్లూరి వేంకట సూర్యనారాయణ
లబ్ధిదారు-తెనాలి. సెల్ : 9885250834

ఘనంగా ఛత్రపతి శివాజీ వర్ధంతి



శివాజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నినాదాలు చేస్తున్న నేతలు

తెనాలి: హిందూ చైతన్య వేదిక, శివాజీ స్మారక సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తెనాలిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీచౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హిందూ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ భారత దేశంలో ముస్లిం ముష్కరులు, విదేశీ దాడుల నుంచి ప్రజలను రక్షించారని చెప్పారు. హిందూ పదపాదశాహి అనే బిరుదుకు అంకితమై హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారని వివరించారు. యువతరం ఆయన చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. శివాజీ స్మారక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ మాట్లాడుతూ శివాజీ మహరాజ్ రాయగడ కోటలో 1680 ఏప్రిల్ 3న మృతి చెందినట్టు తెలిపారు. ప్రతి హిందువు శివాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి మారుతీరామ్, ఆర్ఎస్ఎస్ స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ అవ్వారు శ్రీనివాస్, శివాజీ స్మారక సమితి నాయకులు తరుణ్ గోపి. హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఉల్లంగంటి శ్రీనివాస్, తాడేపల్లి మూర్తి, దాసరి నాగార్జున, హరి వెంకట, మహిళా నాయకులు కారంపూడి రమాదేవి, శారద, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పొత్తూరి అదిశేషు, హనుమంతు ప్రసాద్, ఛత్రగడ్డ రమణ, బీజేపీ నాయకులు కటారి వాసుదేవనాయుడు, అడపా సంపత్, కుషాల్ రాజ్, రామిశెట్టి గోపి, కోవూరు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు నన్నపనేని రాంబాబు పాల్గొన్నారు.

నేడు క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

రేపల్లె రూరల్: పాస్టర్ పగడాల ప్రవీణ్ అకాల మృతి పట్ల రేపల్లె ఏరియా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శాంతి ర్యాలీ నిర్వహించటం జరుగుతుందని రేపల్లె క్రైస్తవ సంఘాల సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోవా స్కూల్ దగ్గర నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో క్రైస్తవులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యవస్థాపన మనస్తత్వ అభివృద్ధిపై అవగాహన అవసరం



తెనాలిటౌన్: విద్యార్థులు వ్యవస్థాపన మనస్తత్వ అభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలని కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు సూచించారు. గురువారం రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఈఎండీపీ ప్రాజెక్టులో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. 9వ తరగతి విద్యార్థులు జంగం దర్శిని ప్రియా, నలుకుర్తి అలేఖ్య, షేక్ కమర్ జహాలు ఎకో ఫ్రెండ్లీ హెర్బల్ అండ్ ఆర్గానిక్ షాంపు అనే ప్రాజెక్టును జిల్లా స్థాయిలో ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్ మత్తె అన్నారావును అభినందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

